శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

# జీవితం

మెట్లెక్కి నేను లోపలికి ప్రవేశిస్తూండగానే నన్నుచూసి కంపౌండరు చిరునవ్వు నవ్వి చేతితో ఓ మూలగది-అదే-డాక్టరు తాలూకు పర్సనల్ రూమువేపు చూపించాడు. ఔను. నేను అతనికి కూడా సుపరిచితుడినే. పేషంటుని కాకపోయినా రెండు రోజులకో, మూడురోజులకో ఒకసారి డాక్టర్ని చూడకుండా ఉండలేను. స్నేహం. ఎవరో 'ప్రేమకూడా వ్యాధే' అన్నట్లు గుర్తు. స్నేహం కూడా జబ్బేనా? ఐతే ఏం? తీయని వ్యాధి.

డాక్టర్ని చూసి నాలుగైదురోజులు దాటిపోతోంది. వర్షమూ, ముసురూ. రోడ్లన్నీ బురద బురద. మన యిళ్లలాగే రోడ్లుకూడా ఎండకేతప్ప వానకి పనికిరావు.

స్వింగ్‌డోర్స్ తెరవబోతూ ఒక్కసారి సందేహించాను. కన్సల్టింగ్ టైములో డాక్టరు పర్సనల్ రూములో ఎందుకున్నాడు?

అతనికీ నాకూ మధ్య అరమరికలులేవు. నాకు ప్రవేశంలేదనే స్థలమూ లేదక్కడ.

తలుపులు తోశాను. సిగరెట్‌పొగ గుప్పుమంది.

మబ్బుపట్టిన ఆకాశంలా ఉంది సిగరెట్ పొగ ఆవరించిన ఆ గది.

"శేఖరం!...చంద్రశేఖరం..."

రెండో పిలుపుకి కాని నా రాకను గమనించలేదతను. గమనించాక మాత్రం ఉత్సాహంగా ఆహ్వానించాడా అంటే అదీలేదు!

ఏదోలోకంలోంచి మళ్లె నీరసంగా, నిర్లిప్తంగా విధిలేనట్లు "రా. కూర్చో." అన్నాడు.

అవమానం అనిపించలేదు కానీ నా మనసు బాధపడింది. క్షమించేశాను.

అతను ఆలోచనల లోకంలోంచి దిగి రాదల్చుకోనట్లున్నాడు.

అతన్నంత వేధిస్తున్న సమస్యేమిటి?

"చెప్పవయ్యా. ఏం జరిగింది? ఈ మౌనమూ, ఆలోచనలూ ఏమిటి?" అడిగాను. చంద్రశేఖరం నావేపు ఒకసారి చూశాడు. అతని కళ్లు చూశాక నాకు భయం వేసింది. నిశ్చయంగా ఆతని కళ్లలోని కాంతిక్షీణతకు కారణం సిగరెట్ పొగ ఎంతమాత్రమూ కాదు. కొమ్మలు ఎండిపోడానికి కారణం చెట్టు వేళ్లలో ఉండేటట్లే, చంద్రశేఖరం కళ్లల్లోని నిర్లిప్తతకూ, నిరుత్సాహానికీ హేతువు – అతని మనసులో ఉండి ఉండాలి. అది ఏమిటి?

"ఏమీలేదు..." విషయం మార్చడానికి ప్రయత్నించాడు. నవ్వాడు.

అతను-ఏమీలేదనడంవల్ల నిశ్చయంగా ఏదో ఉండి ఉంటుందనిపించింది నాకు.

అపనమ్మకం కూడా మనిషి నైజంలో ఉంటుందేమో!

"ఈ వయసులో ... మన స్నేహంలో – దాచుకోవలసిన రహస్యాలుంటాయనుకోలేదు–" అస్త్రం ఉపయోగిస్తేతప్ప అతను లొంగలేదు.

* * *

భోరున వర్షంకురుస్తూంది-కొన్ని గంటలనుంచీ అదేపనిగా. ఆకాశం కనిపించనంత దట్టంగా పడుతూంది వర్షం. రాత్రి తొమ్మిది దాటుతోంది. నిద్రపోదామా అనుకుంటున్నాడు.

తలుపు తట్టిన శబ్దమూ – డాక్టరుగారూ అన్న పిలుపూ. లేచాడు. ఐదారుమైళ్ళదూరంలో ఉన్న పల్లెటూరులో ఓ పేషంట్ అటా యిటా అన్నట్లున్నాడట. అతనివాళ్లువచ్చి రమ్మంటున్నారు. రెండోమాట అనకుండా బయలుదేరాడు. కొంతదూరం వెళ్లాక జ్ఞాపకం వచ్చింది టార్చి తెచ్చుకోలేదని. ఫరవాలేదని సరిపెట్టుకున్నాడు.

కరెంటులేని పల్లెటూరేమో చీకటి ముద్దలాఉంది అదంతా. జట్కా ఆగింది. ఆ యింటి లోపల దీపాలు వెలుగుతున్నాయి. ఎవరో దారిచూపగా పేషంటున్న గదిలోకి నడిచాడు. అక్కడ కాంతివంతంగా వెలుగుతూంది దీపం-టేబుల్‌లాంప్.

పేషంట్‌ని పరీక్షించసాగాడు చంద్రశేఖరం. ఐదునిముషాలలో అతను నిర్ధారించుకున్నాడు. కేసు మరీ సీరియస్ ఏమీ కాదు. ప్రాణాపాయంలేదు. పేషంట్ తెలివిగానే ఉన్నాడు. సిరంజ్‌లోకి మందు ఎక్కించాడు. పేషంట్ చూస్తున్నాడు-కళ్లల్లో భయంతో. అవతల వర్షం కురుస్తూనేఉంది. గాలిరేగుతూనేఉంది.

సరిగ్గా ప్రిక్ చేయబోతున్నంతలో ...

పెనుగాలి...దీపం ఆరిపోయింది.

గొల్లుమని ఏడుపు. పేషంట్ తల్లికాబోలు– "మమ్మల్ని అన్యాయం చేసిపోయావా నాయనా..." అంటూ రాగానికి లంకించుకుంది.

దీపం తేడానికి ఎవరో వెళ్లారు.

అవతల వర్షం. గదిలో దుఃఖం

డాక్టరుకి కోపమే వచ్చింది– ''ఫరవాలేదని చెప్పానుగా. ఎందు కనవసరంగా ఏడుస్తారు ? మీ రాగాలూ శోకాలూ పూర్తిగా అనవసరం–''

ఎవరో అన్నారు గుమ్మందగ్గరనుంచి – ''అన్ని దీపాలూ ఆరిపోయాయి–''

ముసిలి గొంతుకలో శోకం పెరిగిపోయింది. ''మీకు తెలీదు డాక్టరుబాబూ ! నాకొడుకు ... నా కళ్ల వెలుగు ... మాయింటి దీపం–ఆరిపోయింది–''

అసంభవం– చీకట్లో నవ్వుకుంది వైద్యశాస్త్రం. ఆ తల్లి అమాయకత్వానికి జాలిపడింది. దీపం వెలిగించి తెచ్చారు. ఒకటి... రెండు...మూడు... ఒకదానివెంట ఒకటిగా ఆ గదిలోకి దీపాలు ... కాంతిని పెంచుతున్నాయి.

ఇప్పుడాగది–సత్యంలా అతి ప్రకాశవంతంగాఉంది. సిరంజ్ తీసుకుని–నరంకోసం పేషంట్ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అంతే.

*  *  *

''ఇన్నాళ్ళూ తెలుసుకున్న శాస్త్రం అలా అయింది. ఆ ముసిలమ్మకు తన కొడుకు పోయాడని ఎలా తెలిసింది ? అసలు – ఆ కొడుకు ఎందుకు చనిపోయాడు ? శాస్త్రరీత్యా అతను చని పోవడానికి ఏకారణమూ కనిపించదు. పొరపాటు ఎక్కడ జరిగింది? నాలోనా, నా శాస్త్రంలోనా ?''

అర్థమయింది–అతని ఆవేదన.

ఔను. ఏభయ్యేళ్ల వయసులో – అతనికీ బాధ సహజమే. ఇన్నాళ్ళూ తానెంతో నమ్మిన విద్య ఒక్కసారి ఓడిపోతే... బాధగానే ఉంటుంది.

మెల్లగా అన్నాను– ''పొరపాటు నీదీకాదు, నీ వైద్యశాస్త్రా నిదీకాదు–''

ప్రశ్నార్థకంగాచూశాడు చంద్రశేఖరం నావేపు. ''ఆ గాలిది... సుడిగాలిది...ఆ దీపానిది...ఆ చీకటిది–'' కచ్చితంగా అన్నాను.

అతను నన్ను వెర్రివాడిని మల్లె చూశాడు నేను చెప్ప సాగాను నా ధోరణిలో. ''పేషంట్ చావ సిద్ధంగా లేకపోయినా కొంత బలహీనంగాఉండి ఉంటాడు–''

''ఔను.''

''కాంతి...వెలుగు – ధైర్యాన్నిస్తుంది. ఆ వెలుగులో తన వారినీ, డాక్టరునీ చూస్తూ అతను ధైర్యంగానూ, ఆశగానూ ఉండ గలిగాడు. కాని–ఒక్కసారి చీకటి ఆవరించేసరికి–షాక్ తగిలినట్లయి ఆ బలహీనుడు కళ్లు తేలవేసేశాడు.''

''బాగానేఉంది· మరి–యిలా జరుగుతుందని – జరిగిందని ఆ ముసిలమ్మకెలా తెలిసింది ?''

ఈ డాక్టర్లతో వచ్చిన చిక్కిదే. అన్నిటికీ శాస్త్రీయమయిన ఆధారాయి వెతుకుతారు. జీవితం – శాస్త్రానికి అతీతంగాకూడా కొంత ఉంటుందంటే అంగీకరించరు.

డాక్టరు చంద్రశేఖరం బాధ నాకు పూర్తిగా అర్థమయింది. ''మూడేళ్ళూ సాముచేసి మూలనున్న ముసిలిముండను కొట్టా డన్నట్లు'' యిన్నాళ్ల శాస్త్రాభ్యాసమూ ఓ చదువురాని ముసిలిదాని ముందు తోకముడిచేసిందే అని అతని చిన్నతనం. ఇప్పుడు నేను దానికే మాటలమందు వేయాలి. అతని మానసిక రుగ్మత నివారించాలి.

''చదువు వేరు, జ్ఞానం వేరు. అక్షరాలకంటె అనుభవం ఎక్కువ శక్తికలది. ఆపైన సిక్స్త్ సెన్స్. ఇవన్నీ వదిలేసినా... గుడ్డి గుర్రపు తాపు ఉండనే ఉందిగా ? వైద్యశాస్త్రం గురించి తెలీని, నమ్మకం చాలని ఆ ముసిలమ్మ అంతరాంతరాలలో కొడుకు చనిపోతాడేమో అనే భయపడుతోంది. దుఃఖాన్ని బలహీనపు గుండెలలో అదుముకుంటూంది. దీపాలు ఆరిపోయి– చీకటి ఉరికే సరికి – ఆమెకు షాక్ తగిలి... దుఃఖానికి చిల్లుపడి – శోకంలా వొలికింది. మిడతంబొట్లు శకునంలా ఆమెనోట నిజం పలికింది. అంతే.''

డాక్టరు ముఖం వికసించింది, తన శాస్త్రం ఓడిపోలేదని వినేసరికి. ఈ చిత్రమయిన పరిస్థితిలో ఆ ముసిలమ్మ గెలిచిందే తప్ప డాక్టరు ఓడిపోలేదు! ఔను. మాటలు మసిపూయకుండానే మారేడుకాయలు చేయగలవు.

కాని—

నా నమ్మకమూ అనుభవమూ ఏమిటంటే—

జ్ఞానం ఎంత వికసించినా యింతో అంతో అజ్ఞానం మిగిలే ఉంటుంది.

కాంతితోపాటు క్రీనీడలూ మిగిలి ఉంటాయి.

సత్యంతోపాటు అసత్యమూ ఉంటుంది.

ఈ స్తంభాలాటలో వెదుకులాడుకోడమే కాదూ జీవితం?

అందుకేకాదూ మానవ జీవితంలో యింత ఆకర్షణా, యింత వైవిధ్యమూ?

ఎన్ని కళ్లతో చూస్తే—

ఎన్ని మెదళ్లతో ఆలోచిస్తే—

జీవితం అందుతుంది?